


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

4 PM

www.suryaa.com

www.suryaa.com

www.suryaa.com

బుధవారం

17 ఏప్రిల్ 2024

పేజీలు: 02



బీసీ బిడ్డను బలిచ్చేందుకు

# సీఎం కుట్ర

## టీడీపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు


సానుభూతి కోసం చేసిన గులకరాయి డ్రామాలో బీసీ బిడ్డను బలిచ్చేందుకు సీఎం జగన్ కుట్ర చేశారని టీడీపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. గతంలో కోడికత్తి డ్రామాలో దళిత బిడ్డను ఐదేళ్ల పాటు జైలు పాల్జేశారని మండి పడ్డారు. ఇప్పుడు బీసీ వర్గానికి చెందిన అమాయకపు యువకుడిని ఇరికిస్తు న్నారని దుయ్యబట్టారు. జగన్ రెడ్డిలో మంచి యాక్టింగ్ స్కిల్స్ ఉన్నాయని, సినిమా ఇండస్ట్రీలోకి వెళ్లి ఉంటే మంచి నటుడు అయ్యేవారని అన్నారు.




## "జై హనుమాన్".. అదిరే పోస్టర్ తో ప్రశాంత్ వర్మ గూస్ బంప్స్ ప్రామిస్

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో తేజ సజ్జ హీరోగా అమృత అయ్యర్ హీరోయిన్ గా టాలెంటెడ్ దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన భారీ హిట్ చిత్రం "హను మాన్" కోసం ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మన తెలుగు సినిమా నుంచి మొదటి సూపర్ హీరో సినిమాగా ఇది రాగా దీనికి తెలుగు ఆడియెన్స్ సహా పాన్ ఇండియా ఆడియెన్స్ బ్రహ్మరథం పట్టారు. దీనితో ఈ సినిమాకి సెన్సేషనల్ సీక్వెల్ చిత్రం "జై హనుమాన్" కోసమే అంతా ఆసక్తిగా ఎదురు చూస్తుండగా ఈ సినిమా నుంచి అప్డేట్ ఎప్పుడెప్పుడా అని అభి మానులు ఎదురు చూస్తున్నారు. అయితే అనుకున్నట్టుగానే ప్రశాంత్ వర్మ నుంచి ఈ శ్రీరామ నవమి కానుకగా ఒక ఆసక్తికర పోస్టర్ తో అదిరే అప్డేట్ ని అందించాడు. మరి నీలి మేఘ శ్యామునికి ప్రమాణం చేస్తున్నట్టుగా హనుమంతుని చేతులని చూపిస్తూ వచ్చిన ఈ పోస్టర్ తో ప్రశాంత్ వర్మ కూడా ఒక గూస్ బంపింగ్ ప్రామిస్ ని అందరికీ చేసాడు. ఈ పవిత్రమైన రోజు రామ నవమి సందర్భంగా ఆ శ్రీరాముని ఆశీస్సులతో ఇదే నా ప్రమాణం.. జై హనుమాన్ తో ప్రపంచ ప్రేక్షకులకి ఒక మునుపెన్నడూ లేని అనుభూతిని అందిస్తానని లైఫ్ టైం లో సెలెబ్రేట్ చేసుకునే సినిమాగా తీర్చిదిద్దుతానని తాను ప్రామిస్ చేసాడు. దీనితో ఈ రామ నవమి కానుకగా వచ్చిన ఈ సాలిడ్ అప్డేట్ జై హనుమాన్ కోసం ఎదురు చూస్తున్న వారిలో మరింత సరికొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చింది.








## అయోధ్యలో అత్యద్భుతం..

# బాలరాముడికి సూర్య తిలకం

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య ఆలయంలో ఈసారి శ్రీరామనవమి వేడుకలు అంబరా న్నంటాయి. శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన తర్వాత తొలి నవమి ఇదే కావడంతో అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహి స్తున్నారు. స్వామి దర్శనం కోసం దేశవిదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. బాలరాముడి నుదిటిపై కన్పించిన 'సూర్య తిలకం'తో భక్తజనం పరవశించిపోయింది. అధునాతన సాంకేతికత సాయంతో సూర్యకి రణాలు గర్భగుడిలోని రాముడి విగ్రహం నుదుటిపై తిలకం వలే 58 మిల్లీమీటర్ల పరి మాణంలో కొన్ని నిమిషాల పాటు ప్రస రించాయి.

**అద్దాలు, కటకాలతో..**

మూడో అంతస్తు నుంచి గర్భగుడిలోని బాల రాముడి విగ్రహం నుదుటిపై సూర్యకిరణాలు ప్రసరించేలా అయోధ్య ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరిమిత సంఖ్యలో పైపులు, కుంభాకార, పుటాకార కటకాలతో ఒక వ్యవస్థను రూపొందించారు. ఆలయ శిఖర భాగంలో సూర్యకాంతి గ్రహించేందుకు ఒక పరికరాన్ని ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి పైపులోపలికి కాంతి ప్రసరించి తిలకంగా కన్పించింది. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్(ఐఐఏ) శాస్త్ర వేత్తలు, పరిశోధకుల సాయంతో కేంద్ర భవన నిర్మాణ పరిశోధన సంస్థ(సీబీఆర్ఐ) శాస్త్ర వేత్తలు ఆలయాన్ని ప్రత్యేకంగా నిర్మించారు.

**ప్రతి శ్రీరామనవమి రోజున వచ్చేలా..**

ప్రతి శ్రీరామ నవమి రోజున శ్రీరాముడి విగ్రహంపై ఈ తిలకం దిద్దేలా ఏర్పాట్లు చేశారు. అయితే, ఏటా సూర్యకిరణాలు అక్కడే ఎలా పడతాయి? వాతావరణంలో మార్పులు వస్తుంటాయి కదా? గ్రహాల పరి భ్రమణం, సమయం ఒకేలా ఉంటుందా? అన్న ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. ఈ సమస్యను అధిగమించేందుకు గడియారంలో ముల్లులు తిరిగేందుకు ఉపయోగించే పరిజ్ఞానం తరహాలో గేర్ టీత్ మెకానిజం విని యోగించారు. సూర్యకాంతిని గ్రహించే పరికరం వద్దే మరో పరికరం ఉంచారు. ఇది కాంతిని గ్రహించే అద్దాన్ని 365 రోజులు స్వల్పంగా కదుపుతూ ఉంటుంది. మళ్లీ నవమి రోజు వారు అనుకున్న చోటుకు తీసు కొస్తుంది. అంతకుముందే ఏటా శ్రీరామ నవమి వచ్చే కాలాన్ని సెకన్లతో సహా లెక్కలు వేశారు. ఈ లెక్కల సాయంతో సూర్యకి రణాలు ప్రసరింపజేసే పరికరాలు, వ్యవస్థను రూపొందించారు. ఈ వ్యవస్థ 19 ఏళ్లు నిరా టంకంగా పనిచేస్తుంది. ఆ తర్వాత మరోసారి సమయాన్ని సరిచేయాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

## భద్రాచలంలో వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు..

### పట్టువస్త్రాలు సమర్పించిన సీఎస్

శ్రీరామ నవమిని పురస్కరించుకుని భద్రాచలంలోని రాములోరి ఆలయంలో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మిథిలా మైదానంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎస్ శాంతికుమారి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. శ్రీరామ నామస్మరణతో భద్రాచలం వీధులు మార్మోగుతున్నాయి. కల్యాణాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖతో పాటు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.



## శ్రీరామ నవమి శోభాయాత్ర.. హైదరాబాద్‌లో పలు చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు

శ్రీరామనవమి సందర్భంగా జంట నగరాల్లో శోభాయాత్రకు ఏర్పాట్లు చేశారు. ధూల్‌పేట్ సీతారాంబాగ్ నుంచి కోఠి హనుమాన్ వ్యాయామశాల వరకు యాత్ర సాగనుంది. ఈ మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వెయ్యి మంది పోలీసులతో భద్రత కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జర గకుండా చర్యలు తీసుకుంటున్నారు. భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భవ్య శోభాయాత్రకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శాంతిభద్రతలకు భంగం కలగకుండా పోలీసులు సూచించిన మార్గంలోనే యాత్ర నిర్వహిం చాలని హైకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. గోషామహల్, సుల్తాన్‌బజార్ ఠాణాల పరిధిలోని పలు ప్రాంతాల్లో రాత్రి 11.30 గంటలకు వరకు అవసరం మేరకు ట్రాఫిక్ మళ్లిస్తామని నగర పోలీసు కమిషనర్ తెలిపారు.





## ఏపీ సీఎం జగన్‌పై హీరో విశాల్ కీలక వ్యాఖ్యలు

తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. ప్రస్తుతం దేశమంతా రాజకీయ వేడి బాగా నడుస్తుంది. దాంతో ఎవరు ఎప్పుడు ఎలాంటి కామెంట్స్ చేసినా వెంటనే వైరల్ అవుతున్నాయి. తాజాగా విశాల్ కూడా తాజా రాజకీయాలపై తనదైన శైలిలో స్పందించాడు. రత్నం సినిమా ప్రమోషన్స్ లో భాగంగా హైదరాబాద్ వచ్చిన విశాల్.. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న రాజకీయ పరిస్థితులపై స్పందించడమే కాకుండా.. ఏపీలో ఎవరు ముఖ్యమంత్రి కాబో తున్నారో కూడా క్లారిటీగా చెప్పేశాడు. పైగా తన రాజకీయ భవిష్యత్తుపై కూడా క్లారిటీ ఇచ్చాడు ఈ హీరో. తాను ఆల్రెడీ రాజకీయాల్లోకి వచ్చాను అని.. వాళ్లే నామినేషన్ రిజెక్ట్ చేశారు. 2026 ఎన్నికల్లో పోటీ చేస్తాను.. వాళ్ళు ఏం చేయలేదు కాబట్టే విశాల్ వచ్చాడు.. వాళ్ళు చెప్పింది చేస్తే విశాల్ మళ్లీ సినిమా యాక్టర్ గానే ఉండి పోతాడు అంటూ గట్టిగానే కౌంటర్ వేశాడు ఈ హీరో. జనాలకు మంచి చేయాలి అనుకున్నప్పుడు ఎందుకు ఇన్ని రాజకీయ పార్టీలు.. అందరూ కలిసి మంచి చేయొచ్చు కదా అని కొత్త వాదనకు తెర తీశాడు విశాల్.



## 'ఎక్స్'కు ఈసీ వార్నింగ్

ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్ ఫాం 'ఎక్స్'కు భారత ఎన్నికల సంఘం హెచ్చ రికలు జారీ చేసింది. రాజకీయ ప్రేరేపిత పోస్టులు, ప్రజాప్రతినిధుల ప్రసంగాలు, పోస్టులను తొలగించాలని ఆదేశించింది. ఈ ఆదేశాలు ఆమోదయోగ్యం కాదంటూనే 'ఎక్స్' వాటిని తొలగించింది. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకే వాటిని హోల్డ్‌లో పెడుతున్నట్లు ప్రక టించింది. ఈమేరకు ఎక్స్ ఓ ప్రకటన విడుదల చేసింది.



జైల్లో ఉన్న కేజ్రీవాల్‌కు గవర్నర్ సక్సేనా

## ఓపెన్ లెటర్

మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఢిల్లీలో తాగునీటి సమస్యపై బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా నగరంలో నీటి కొరత సమస్యలను పరి ష్కరించడంలో కేజ్రీవాల్ ప్రభుత్వం విఫల మైందన్నారు. ఈ మేరకు ఢిల్లీలో మంచి నీటి సమస్యపై 2017 నుంచి మీడియాలో వచ్చిన క్లిప్పింగ్స్‌ను లేఖకు జతచేస్తూ.. నగరంలో నీటి సమస్య తీవ్రతను వివరించారు.



## 'ఆ వ్యవస్థలను రక్షించేందుకు ఇండియా కూటమి ప్రయత్నం'

లోక్‌సభ ఎన్నికలపై యూపీలో ఇండియా కూటమి నేతలతో కలిసి రాహుల్ గాంధీ కీలక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను నాశనం చేసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీలు ప్రయత్నిస్తున్నాయి. ఇండియా కూటమి ఆ వ్యవస్థలను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఎన్నికల్లో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అతి పెద్ద సమస్యలు కానీ.. వాటిపై ప్రధాని మోదీ, బీజేపీలు మాట్లాడడం లేదు' అని వ్యాఖ్యానించారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## ఆస్ట్రియన్ పర్యాటకురాలికి కేరళ పోలీసుల సమన్లు

కేరళలోని ఫోర్ట్ కొచ్చిలో వివాదాస్పద ఉదంతం చోటుచేసుకుంది. పాలస్తీనా అనుకూల పోస్టర్‌ను చింపివేసూ ఒక ఆస్ట్రియన్ యూదు పర్యాటకురాలు కేరళలో స్థానికులతో వాదిస్తూ కెమెరాకు చిక్కింది. ఈ వారం ప్రారంభంలో ఎర్నాకులం జిల్లా ఫోర్ట్ కొచ్చిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో పోస్టర్‌ను చింపివేస్తున్న ఆమెను వారించేందుకు స్థానిక యువకులు ప్రయత్నించగా, ఆమె వారితో వాగ్వాదానికి దిగడం కనిపిస్తుంది. ఆ పోస్టర్ చినిగిన ముక్కలను తీయమని అక్కడున్న యువకులు ఆమెకు చెప్పడాన్ని వీడియోలో చూడవచ్చు. ఆ గోడపత్రికతో సమస్య ఉంటే పోలీసులను సంప్రదించాలని వారు ఆమెకు సూచించడాన్ని కూడా ఆ వీడియోలో గమనించవచ్చు. ఈ వీడియో వైరల్‌గా మారిన నేపథ్యంలో కేరళ పోలీసులు విచారణ కోసం ఆ మహిళను పోలీస్ స్టేషన్‌కు రావాలని కోరారు. మీడియాకు అందిన సమాచారం ప్రకారం స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఓ)కొచ్చి ఏరియా సెక్రటరీ మహమ్మద్ అజీమ్ కెఎస్ ఆ మహిళపై ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఎటువంటి కేసులు నమోదు చేయలేదు. ఎస్ఐఓ అతికించిన పోస్టర్లను ఆ ఆస్ట్రియన్ యువతి చించి వేసింది. కాగా గత జనవరిలో కోజికోడ్ బీచ్ సమీపంలోని స్టార్‌బక్స్ స్టోర్‌పై పాలస్తీనా అనుకూల పోస్టర్‌లు అతికించిన ఆరుగురు విద్యార్థులను కేరళ పోలీసులు అరెస్టు చేశారు. నాడు నమోదైన ఎఫ్ఐఆర్ ప్రకారం స్టార్‌బక్స్ స్టోర్ గ్లాస్ డోర్‌పై ఆ విద్యార్థులు 'ఫ్రీ పాలస్తీనా' అని రాసిన పోస్టర్లను అతికించారు. గాజాలో జరిగిన యుద్ధ నేపథ్యంలో స్టార్‌బక్స్ ఇజ్రాయెల్‌కు అనుకూల వైఖరిని ప్రదర్శించినదుకు విమర్శలకు గురైంది.



## దుబాయ్‌లో వర్ష బీభత్సం

వర్ష బీభత్సానికి ఎడారి దేశం దుబాయ్ విలవిలలాడిపోతోంది. కేవలం గంటన్నర వ్యవధిలో అంటే 90 నిమిషాల్లో.. ఏడాదిలో కురవాల్సిన వర్షమంతా ఒకేసారి కురిసింది. భారీ వర్షానికి తోడు వేగంగా వీచిన ఈదురు గాలులకు చెట్లు నేల కూలాయి. కుండపోత వర్షానికి రోడ్లన్నీ జలమయంగా మారాయి. మాల్స్ అన్నీ నీటితో నిండిపోయాయి.దుబాయ్ ఎయిర్ పోర్టులోనూ వర్ష బీభత్సం ప్రత్యక్షంగా కనిపించింది. దీంతో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బయటి రోడ్లను చూస్తే అవి చెరువులను తలపించాయి. రైల్వే వ్యవస్థ చాలావరకూ దెబ్బతింది. సబ్ వేలన్నీ నీట మునిగాయి. రోడ్లపై నిలిపివుంచిన కార్లు నీటిలో కొట్టుకుపోయాయి.దుబాయ్ తీరాన్ని తాకిన తుఫాను కారణంగా ఈ ప్రకృతి విలయం సంభవించింది. భారీ వర్షాల కారణంగా పోటెత్తిన వరదలతో యూఏఈ అంతటా జన జీవనం స్తంభించింది. స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. ప్రైవేట్ ఉద్యోగులకు ఆయా సంస్థలు వర్క్ ఫ్రం హోం వెసులుబాటును కల్పించాయి. ఫుజైరా ఎమిరేట్స్‌లో దుబాయ్‌కి మించిన వర్షపాతం నమోదయ్యింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రపంచంలోనే అతిపెద్ద షాపింగ్ మాల్ అయిన మాల్ ఆఫ్ ఎమిరేట్స్ లోపలికి నీరు ప్రవేశించింది. నీటి ఒత్తిడికి మాల్ పైకప్పు భాగాలు ఊడి కింద పడ్డాయి. గత 75 ఏళ్లలో ఎప్పుడూ ఇంతటి భారీ వర్షాలు కురియలేదని అధికారులు తెలిపారు.రోడ్లపై భారీగా నిలిచిన నీటిని అధికారులు ట్రక్కుల్లో నింపి క్లియర్ చేస్తున్నారు. మరోవైపు దేశ వ్యాప్తంగా రాగల 48 గంటల్లో భారీ వర్షాలు కురియవచ్చని పేర్కొంటూ జాతీయ వాతావరణ కేంద్రం రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రాకూడదని హెచ్చరించింది.




## మెదక్‌లో బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదు

కల్వకుంట్ల కవిత చేసిన పనికి తెలంగాణ ప్రజలకు కేసీఆర్ క్షమాపణలు చెప్పాలన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. అలాగే, మెదక్‌లో ఎన్ని కోట్లు ఖర్చు చేసిన బీఆర్ఎస్ గెలవలేదని జోస్యం చెప్పారు. కాగా, మంత్రి కోమటిరెడ్డి బుధవారం నల్లగొండలో మీడియాతో మాట్లాడుతూ..'ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం హాస్యాస్పదం. మేము గేట్లు తెరిస్తే బీఆర్ఎస్‌లో ఒక్కరు కూడా మిగలరు. మూడు నెలల్లో బీఆర్ఎస్ కనుమరుగవుతుంది. మెదక్‌లో వెయ్యి కోట్లు ఖర్చు చేసినా బీఆర్ఎస్ గెలవలేదు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 14 స్థానాలు గెలుస్తుంది. కేసీఆర్ కూతురు అవినీతి చేసి తీహార్ జైలులో ఉన్నారు. బిడ్డ చేసిన పనికి కేసీఆర్ క్షమాపణలు చెప్పాలి. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు జైలుకు వెళ్తారు. యాదాద్రి పవర్ ప్లాంట్ అవినీతి విషయంలో జగదీష్ రెడ్డి జైలుకు పోతారు. జగదీష్ రెడ్డి వేల కోట్ల రూపాయాలు దోచుకున్నారు. శంషాబాద్‌లో ఫామ్ హౌస్ కూడా కొన్నాడు. జగదీష్ రెడ్డి అవినీతిని బయటకు తీస్తాం. నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల్లో బీఆర్ఎస్, బీజేపీలకు డిపాజిట్లు కూడా రావు' అంటూ వ్యాఖ్యలు చేశారు.




## సీఐ తిట్టాడని కానిస్టేబుల్ రాజీనామా.. కట్ చేస్తే సివిల్స్ ర్యాంకర్‌గా ఉదయ్

తన చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయినప్పటికీ పట్టుదలతో ఓ యువకుడు సివిల్స్ ర్యాంకు సాధించాడు. తన కోసం నానమ్మ పడుతున్న కష్టాన్ని గుర్తు చేసుకుంటూ జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించుకునేందుకు ఎంతో కృషి చేశాడు. తన లక్ష్యసాధనలో సివిల్స్‌లో 780వ ర్యాంకు సాధించాడు. అతనే ప్రకాశం జిల్లాకు చెందిన మూలగాని ఉదయ్‌కృష్ణారెడ్డి. వివరాల్లోకి వెళ్తే.. సింగరాయకొండ మండలం ఊళ్లపాలేనికి చెందిన మూలగాని ఉదయ్‌కృష్ణారెడ్డి సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించారు. ఐదేళ్ల వయసులో తల్లి జయమ్మ మృతి చెందారు. తండ్రి శ్రీనివాసులురెడ్డి భరోసా, నానమ్మ రమణమ్మ బాధ్యతలు చూశారు. ఉదయ్ ఇంటర్ చదువుతున్న సమయంలో తండ్రి శ్రీనివాసులు చనిపోయారు. తండ్రి అకాల మరణంతో ఉదయ్, తన సోదరుడు ఎంతో ఆవేదనకు గురయ్యారు. ఆ సమయంలో వారికి నానమ్మ కొండంత అండగా నిలిచారు. నానమ్మ రమణమ్మ అప్పటి నుంచి ఇద్దరు మనవళ్ల చదువు కోసం కష్టపడ్డారు. దీంతో, 2013లో ఉదయ్ మొదట కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. 2018లో కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేసి హైదరాబాద్‌లో ఉంటూ సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. మూడు ప్రయత్నాల్లోనూ విఫలమైనప్పటికీ ఆత్మవిశ్వాసం సడలకుండా నాలుగోసారి ఉత్తమ ర్యాంకు సాధించారు.






## జనసేన అభ్యర్థులకు బీ ఫారాలు అందజేసిన పవన్‌కల్యాణ్

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో జనసేన పార్టీ అభ్యర్థులకు పవన్‌కల్యాణ్ బీ ఫారాలను అందజేశారు. శ్రీరామ నవమి పండుగ సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తొలి బీ ఫాంను తెనాలి అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కు అందజేశారు. అనంతరం పార్టీ అభ్యర్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏపీలోని 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలుండగా టీడీపీ, జనసేన, బీజేపీలతో కుదుర్చుకున్న పొత్తుల కారణంగా 21 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలకు జనసేన పోటీ చేస్తుంది . ఈ సందర్భంగా ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించిన పవన్‌కల్యాణ్ పండుగ రోజున బీ ఫారాలు అందజేసి అభ్యర్థులను ఉత్సహపరిచారు.

## నితిన్‌కి జోడీగా

ఒకప్పుడు తెలుగులో అగ్ర కథానాయికల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకుంది పంజాబీ సోయగం రాశీఖన్నా. 'థాంక్యూ' సినిమా తర్వాత తెలుగులో ఏ చిత్రానికి అంగీకరించలేదు. ప్రస్తుతం టాలీవుడ్‌లో పూర్వ వైభవాన్ని సంపాదించుకునే ప్రయత్నాల్లో ఉందీ భామ. తాజా సమాచారం ప్రకారం ఈ అమ్మడు తెలుగులో నితిన్‌తో ఓ సినిమా చేయబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో 'రాబిన్‌హుడ్' పేరుతో సినిమా తెరకెక్కుతున్నది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ సినిమాలో రాశీఖన్నాను నాయికగా ఖరారు చేసినట్లు సమాచారం. గతంలో ఈ జంట 'శ్రీనివాస కల్యాణం' చిత్రంలో నటించారు. సుదీర్ఘ విరామం తర్వాత మరోసారి ఈ జోడీ వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమవుతున్నది. రాశీఖన్నా నటించిన తమిళ చిత్రం 'అరణ్మనై-4' 'బాక్' పేరుతో ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురానుంది.




## నితిన్ "రాబిన్‌హుడ్" రిలీజ్ డేట్ ఫిక్స్!

టాలీవుడ్ హీరో నితిన్ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ వెంకీ కుడుముల డైరెక్షన్ లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ రాబిన్‌హుడ్. ఈ చిత్రం నుండి రిలీజైన ప్రచార చిత్రాలకి ఇప్పటికే ప్రేక్షకుల నుండి, అభిమానుల నుండి మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుండి బిగ్ అప్డేట్ ను మేకర్స్ నేడు శ్రీ రామ నవమి పండుగ సందర్భంగా వెల్లడించారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 20, 2024 న వరల్డ్ వైడ్ గా థియేటర్ల లో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. రిలీజ్ చేసిన సరికొత్త పోస్టర్ లో హీరో నితిన్ చాలా స్టైలిష్ గా కనిపిస్తున్నారు. పోస్టర్ ఆడియెన్స్ ను విశేషం గా ఆకట్టుకుంటుంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని మరియు వై రవిశంకర్ లు నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. రాశి ఖన్నా, రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ లు కీలక పాత్రల్లో కనిపించనున్న ఈ చిత్రం పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.